



ఆపరేషన్ స్మైల్ పోస్టర్‌ను చూపిస్తున్న సీపీ డాక్టర్ బి.అనురాధ

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- ఊసేలేని సైనిక్ స్కూల్
- జిల్లాకు మరో 25 మెడికల్ సీట్లు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ కొందరికి ఇష్టంగా, మరికొందరికి కష్టంగా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు ది పవర్ ఆఫ్ రైజింగ్ మిడిల్ క్లాస్ అనే పేరుతో 2025 బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. కేంద్ర బడ్జెట్ అంకెలగారడీలాగా ఉందని మరోవైపు విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. సిద్దిపేట జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని ఆశపడిన వారికి భంగం కలిగినట్లుగా ఉందని వెల్లడించారు.

- సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట జిల్లాకు ఈ ఏడాదైనా సైనిక్ స్కూలు, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటుకు బడ్జెట్‌లో గ్రీన్ సిగ్నల్ వస్తుందని ఆశించిన జిల్లా ప్రజలకు నిరాశే మిగిలింది. దాంతో పాటు బడ్జెట్‌లో కేటాయించిన రైల్వే నిధులు సిద్దిపేట జిల్లాకు ఎంత వస్తాయోనన్న ప్రకటనపై జిల్లా ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. సిద్దిపేట జిల్లాకు నూతన ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు నిధులు, కొత్తపల్లి-మనోహరబాద్ రైల్వే పనులపై, పెండిగ్ పనుల నిధులపై పెట్టుకున్న ఆశలపై కేంద్రం కరుణించలేదు. ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి ఊరట ఇవ్వడంతో మధ్యతరగతి, వేతన జీవులకు, చిన్నపాటి ట్యాక్స్ పేయర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరగనున్న మెడికల్ సీట్లు

వైద్య విద్యల్లో మెడికల్ సీట్లను పెంచనున్నట్లు కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు ఏడాదికి 175 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందనుండగా, తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మెడికల్ సీట్ల పెంపుతో అవి 200 సీట్లకు చేరుకోనున్నాయి. దాంతో పాటు కేన్సర్‌ను అరికట్టేందుకుగాను ప్రతి జిల్లాలో త్వరలోనే కేన్సర్ వైద్యసేవలందించనున్నట్లు ప్రకటించారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచడంతో, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా లక్షా 60వేల మందికి లబ్ధిచేకూరనుంది.

ఓట్లు పొందారు.. నిధులివ్వలేదు



బీజేపీ ఓట్లను పొంది.. అభివృద్ధికి మాత్రం ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. బీఆర్ఎస్ పాలనలో కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఎంతో కొంత న్యాయం జరిగేది. ఇప్పటికైనా బీజేపీ, కాంగ్రెస్‌ల గురించి ప్రజలు అర్థం చేసుకోవాలి. ఈ బడ్జెట్ కేవలం బీహార్‌కు సంబంధించిన బడ్జెట్‌లాగానే ఉంది.

-కొండం సంపత్‌రెడ్డి,
బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్ అంకెల గారడి



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ లాగా ఉంది. అన్ని రంగాల వారిని కేంద్రం మరోసారి మోసం చేసింది. బీహార్ రాష్ట్రంలో ఎన్నికలు ఉన్నందున ఆ రాష్ట్రానికి బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. సిద్దిపేట జిల్లాలో రైలు, రోడ్ల నిర్మాణానికి, ఉపాధి రంగాల ఏర్పాటును విస్మరించింది.

-అత్తు ఇమామ్,
కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు

ఒరిగిందేమీలేదు..



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు మరోసారి తీరని అన్యాయం జరిగింది. ఐఐఎం, ఐఐటీ, సైనిక్ పాఠశాలలు, కేంద్ర విద్యాసంస్థలు రావాల్సి ఉండగా అవేమీ పట్టించుకోలేదు. రాష్ట్రం ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా.. ఒరిగిందేమీలేదు. మధ్యతరగతికి పెద్ద ఊరట అని బీజేపీ చేస్తున్న ప్రచారం అవాస్తవం.

-మంద పవన్,
సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి

అద్భుతంగా ఉంది



2025-26 బడ్జెట్ అద్భుతంగా ఉంది. .రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకం. దీంతో ఒక్కో ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదా అవుతుంది. రైతులు, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడే బడ్జెట్‌పై విపక్షాలు విమర్శలు మాని సహకరించాలి.

- గంగాడి మోహన్ రెడ్డి,
బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు

83 మంది బాలలకు విముక్తి

- పూర్తయిన ఆపరేషన్ స్మైల్ -11
- బాలలతో పనిచేయించిన 17 మందిపై కేసులు
- సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జనవరి 1న ప్రారంభమైన ఆపరేషన్ స్మైల్ -11 శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ మాట్లాడుతూ నెలరోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన 83 మంది బాలకార్మికులకు పని నుంచి విముక్తి కల్పించామన్నారు. అందులో 56 మంది బాలురు, 27 మంది బాలికలు ఉన్నారని, వారిని తిరిగి వారి తల్లిదండ్రులకు, బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. బాల కార్మికులతో పనిలో పెట్టుకున్న 17 మంది యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. ఆపరేషన్ స్మైల్-11ను విజయవంతం చేసిన నోడల్ అధికారి సీసీఎస్ ఏసీపీ యాదగిరి, డిపార్ట్‌మెంట్ అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు. అలాగే డీఐజీ డాక్టర్ గజరావు భూపాల్ శనివారం సీపీ అనురాధతో కలిసి పోలీస్ కమిషనర్ కార్యాలయం, పొన్నాల గ్రామ శివారులోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్, నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ పంపును సందర్శించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ ధరణి కుమార్, విష్ణు ప్రసాద్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, సీసీ నితిన్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాకులను డిపాజిట్ చేయాలి

గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున లైసెన్స్ ఉన్న తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈనెల 8లోపు డిపాజిట్ చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వర్గల్‌లో ముస్తాబైన విద్యాధరి క్షేత్రం

- రేపు వసంత పంచమి
- పీఠాధిపతులు, మంత్రుల రాక
- దర్శనాలు, అక్షరాభ్యాసాలకు ప్రత్యేక క్యూలైన్లు
- ఏర్పాట్లు పూర్తి
- గట్టి పోలీస్ బందోబస్తు

10



సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

- కాలువ తవ్వకం పనులతో నీరు బంద్
- వరి పైరు ఎండిపోయే ప్రమాదం
- వెంటనే పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని డిమాండ్

10



ముగిసిన పుల్లూరుబండ జాతర

- ఘనంగా సుదర్శన నారసింహహోమం, చక్రతీర్థ స్నానం



10



రంగధాంపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ అనుకూలమే

- మాదిగలది న్యాయమైన పోరాటం
- కేసీఆర్ ఈ విషయంలో ప్రధానిని కూడా కలిశారు
- వర్గీకరణ ప్రకారమే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఉండాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట/సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అనుకూలమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. శనివారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని రంగధాంపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దశాబ్దాలకాలంగా మాదిగలు న్యాయమైన పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. వర్గీకరణకు సంపూర్ణమైన మద్దతును ప్రకటిస్తూ కేసీఆర్ గతంలో ప్రధాన మంత్రిని కూడా కలిసి విజ్ఞప్తి చేశారని, తాను కూడా అసెంబ్లీలో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ వర్గీకరణకు అనుకూలంగా రిజర్వేషన్లు ప్రకటించాలని, రాజకీయంగానూ మాదిగలకు తగిన ప్రాధాన్యత దక్కాలని అన్నారు.

అంబేడ్కర్ విగ్రహం గేట్లకు బేడీలు..

అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రపంచమంతా చాటేందుకు కేసీఆర్ సచివాలయం పక్కనే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మిస్తే రేవంత్‌రెడ్డి ఆ గేట్లకు బేడీలు వేశారని మండిపడ్డారు. కేసీఆర్‌పై కోపంతో దర్శనీయ స్థలమైన అంబేడ్కర్ విగ్రహానికి దుమ్ము పట్టేలా వ్యవహరిస్తున్నాడన్నారు. దళితు బంధు పేరిట కేసీఆర్ రూ.10లక్షలు అందిస్తే తాము రూ.12లక్షలు ఇస్తానని మొత్తానికే ఎసరు పెట్టాడని రేవంత్‌ను విమర్శించారు.

ఇది బీహార్ బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ పూర్తిగా బీహార్‌కు కేటాయించినట్లుగా ఉంది. దేశమంటే మట్టికాదు దేశమంటే మనుషులోయ్ అని ప్రసంగం ప్రారంభించిన నిర్మలకు దేశమంటే కొన్ని రాష్ట్రాలు మాత్రమే కాదనే విషయం తెలియదా. ఏ రాష్ట్రంలో ఎన్నికలుంటే ఆ రాష్ట్రానికి ఎక్కువ కేటాయింపులు చేస్తున్నారని అర్థమైంది. ఎనిమిది మంది కాంగ్రెస్, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు కలిసి తెలంగాణకు గుండుసున్నా

-మిగతా 10వ పేజీలో...

డబ్బులిస్తే చాలు!



పత్రాలు, యజమాని లేకున్నా క్షణాల్లో పని

- ప్రతీ పనికో రేటు.. దళారుల ద్వారా దందా
- మారని ఆర్టీవో అధికారుల తీరు
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు!
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ఆర్టీవో అధికారులు, సిబ్బంది ప్రతీ పనికి ఒక రేటు పెట్టి ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకుంటున్నారు. బాధితులు నేరుగా వెళితే పనిచేయకుండా దళారులతో ఫైలు పంపిస్తే డబ్బులు తీసుకొని పనిచేస్తున్నారు. సరైన పత్రాలు లేకున్నా, బ్రోకర్లకు ద్వారా డబ్బులు ఇస్తే పని పక్కాగా త్వరగా జరుగుతుంది.

యజమాని లేకున్నా..

ఆర్టీవో కార్యాలయంలో డబ్బులు వసూలు చేస్తూ అధికారులు సిబ్బంది కలిసి నచ్చిన విధంగా సరైన పత్రాలు లేకున్నా, చివరకు వాహనాల యజమానులు లేకున్నా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో సిద్దిపేట కాళ్లకుంట కాలనీ చెందిన ఒక వ్యక్తి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తన కారు పై లోన్ తీసుకున్నాడు. కారు ఈఎంఐ గడువు ముగిసే దాకా డబ్బులు కట్టడంతో యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది కారు ఓనర్‌తో మాట్లాడి మీకు తక్కువ ఇంట్రెస్ట్‌కు లోన్ ఇస్తామని చెప్పారు. ఓనర్ ఒప్పుకోవడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వకముందే 11 లక్షలు లోను ఇచ్చినట్లు సమాచారం. కానీ తక్కువ ఇంట్రెస్ట్ కాకుండా ఎక్కువ ఇంట్రెస్ట్ ఉండటంతో ఓనర్ యాక్సిస్ బ్యాంక్ సిబ్బందితో గొడవకు దిగాడు. ఓనర్ అకౌంట్‌కు పంపిన డబ్బులు తిరిగి రాకపోవడంతో యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకొని ఆర్టీవో ఆఫీస్‌కు వెళ్లి ఓనర్‌కు తెలవకుండా ఓనర్ ఆధార్ కార్డు పెట్టి ఆర్టీవో సిబ్బందితో కుమ్మక్కై యాక్సిస్ బ్యాంకు సిబ్బంది ఫొటో దిగినట్లు సమాచారం. వెంటనే కార్డు తీసుకొని వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ విషయం కారు ఓనర్‌కు తెలువడంతో తన పేరు మీద ఎవరో వ్యక్తి ఫొటో దిగారని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పోలీసులు ఆర్టీవో ఆఫీస్ ఏవోను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు సమాచారం. ఫొటో దిగిన ఫైల్ కోసం అడిగితే కనిపించడం లేదని చెప్పినట్లు తెలిసింది. ఏవో పై కేసు నమోదు అయినట్లు సమాచారం.

ఇసుక లారీల నుంచి వసూళ్లు..

సిద్దిపేట జిల్లాలో బెజ్జంకి నుంచి ములుగు వరకు సుమారు 90 కిలోమీటర్ల రాజీవ్ రహదారి ఉన్నది. ఈ రహదారిపై 24 గంటలు ఇసుక లారీలు తిరుగుతూ ఉంటాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన కన్నా ఎక్కువగా లోడు వేసుకొని రవాణా చేస్తారు. ఇలాంటి లారీల దగ్గర రూ.10వేలు, అసలు అనుమతి లేకుంటే రూ.20వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

డబ్బులు తీసుకుని లేట్ రిజిస్ట్రేషన్లు

సాధారణంగా రిజిస్ట్రేషన్ కానీ కొత్త వాహనాలను ఈఎంఐలు కట్టకుంటే ఫైనాన్స్ కంపెనీలు సీజ్ చేస్తాయి. ఆ వాహనాలను వేరే వారికి అమ్ముతారు. వాటి రిజిస్ట్రేషన్‌కు ఆర్టీవో ఆఫీస్‌లో వాహన మొదటి ఓనర్ ను పిలిపించి ఎందుకు రిజిస్ట్రేషన్ చేసుకోలేదని అగ్రిమెంట్ తీసుకొని ఆధార్ కార్డు, సంతకాలు తీసుకుని సంబంధిత వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ సిద్దిపేట ఆర్టీవో కార్యాలయంలో వాహనాల మొదట ఓనర్ పిలవకుండా నేరుగా లేట్ రిజిస్ట్రేషన్‌లను చేస్తున్నట్లు తెలుస్తుంది. వీటికి ఒక్క వాహనానికి సుమారు రూ.5వేల నుంచి రూ.10 వేల వసూలు చేస్తున్నట్లు సమాచారం.

డబ్బులు ఇస్తే వెంటనే కార్డు చేతికి

ఇక్కడ రిజిస్ట్రేషన్ అయిన రోజే డబ్బులు ఇస్తే వెంటనే కార్డులు చేతికి అందిస్తున్నారు. ఒక కార్డుకు రూ.200 నుండి 300 వరకు వసూలు చేసి పంపిణీ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి చెప్పుల దండ

- నిధుల విషయంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య రగడ



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, కొమ్మూరి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆధిపత్యపోరు తారాస్థాయికి చేరింది. కొద్దిరోజుల క్రితం వరకు ప్రోటోకాల్ రగడ కొనసాగగా, తాజాగా నిధుల మంజూరు విషయంలో రభస నెలకొంది. ఇటీవల జనగామ జిల్లాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కోడిగుడ్ల దాడి ఘటన చోటుచేసుకోగా, ఇప్పుడు చేర్యాల మండలం తాడూరులో ఆయన ఫ్లెక్సీకి చెప్పుల దండ వేశారు. మండలంలోని కమలాయపల్లి రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల రూ.6కోట్లు మంజూరు చేయగా, ఎమ్మెల్యే వల్లే నిధులు వచ్చాయని బీఆర్ఎస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కృషితోనే నిధులు వచ్చాయని కాంగ్రెస్ నాయకులు ప్రకటనలు చేసుకున్నారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రకటనలు చేయడం తగదంటూ కాంగ్రెస్ నేతలు శనివారం ఎమ్మెల్యే ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి, దానికి దహనం చేశారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఎమ్మెల్యే తాను మంజూరు చేయించాననడం తగదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, కొమ్మూరి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, కర్క సంతోశ్‌రెడ్డి, దాసరి కళావతి, తోళ్ల రాజేశ్వరి, వంగ జయలక్ష్మి, బందిగ రాకేశ్‌కృష్ణన్, ముస్త్యాల యాదగిరి, వజ్రోజు శంకరాచారి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆందోళన

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి చెప్పుల దండ వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి అవహేళన చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చొరవతోనే ముమ్మాటికీ నిధులు మంజూరయ్యాయని, అధికార అహంభావంతో కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు సబబుకాదన్నారు. కార్యక్రమంలో నాయకులు పుర్మ వెంకట్‌రెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్ తదితరలుఉ పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ లెక్కింపు

సిద్దిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరాలయ జాతర హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ డివిజన్ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ... మాఘ అమావాస్య జాతరను పురస్కరించుకుని 17రోజుల హుండీ ఆదాయం రూ.3,95,372 సమకూరినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కంది, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. రామచంద్రపురం మండలం వెలివెల గ్రామానికి చెందిన అంశంగారి రాజు(37) కొన్నేళ్లుగా భార్యకు దూరంగా ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి కలివేముల శివారులో ఒంటిపై అక్కడక్కడ దెబ్బలతో చనిపోయి పడి ఉన్నాడు. గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. మృతదేహం వద్ద తాగి పడేసిన మద్యం, మంచినీళ్ల బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు పోలీసులకు లభించాయి. పోలీసులు వెంటనే రాజు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుని ఎక్కడైనా హత్య చేసి కలివేముల శివారులో పడేశారా? లేక ఇక్కడే మద్యం తాగి అతను చనిపోయాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

భర్త వేధింపులతోనే ఆత్మహత్య

రామచంద్రాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 28న అనుమానాస్పద స్థితిలో మరణించిన మహిళ.. భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. సర్వేయరీ కత్తూర్(20) మృతిచెంది ఉండగా, నాడు పోలీసులు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తు చేపట్టగా, భర్త జహంగీర్ వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు తేల్చారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దుబ్బాక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో రైతు ఉరివేసుకున్న ఘటన శనివారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధి ధర్మాజీపేట వార్డులో చోటుచేసుకుంది. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్‌ఐ హరీష్ కథనం ప్రకారం.. ధర్మాజీపేట వార్డుకు చెందిన లక్ష్మన్(49)కు చౌదర్‌పల్లి శివారులో వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల ఇల్లు కట్టుకునేందుకు అప్పులు చేశారు. కుమార్తె వివాహం చేయాల్సి ఉండగా.. చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. శనివారం పొలం వద్దకు వెళ్తానని చెప్పి.. వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా, చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ.. మహిళ మృతి


మృతిచెందిన దివ్య

గుమ్మడిదల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు అదుపు తప్పి ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని మేడలమ్మ ఆలయ జరిగింది. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని మేడలమ్మ ఆలయ సమీపంలో మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు హైదరాబాద్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న మరొక కారును ఢీకొంది. దీంతో హైదరాబాద్ నుంచి వస్తున్న కారులో ప్రయాణిస్తున్న దివ్య(40) అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ తనయుడు నవీన్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన దివ్య తన భర్త అజయ్‌కుమార్, కుమార్తె మన్వితతో కలిసి మెదక్ చర్చి చూసేందుకు వస్తుండగా, ఈ ప్రమాదం జరిగింది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


బాలరాజు (ఫైల్)

అల్లాదుర్గం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం మండల కేంద్రంలో జరిగింది. అల్లాదుర్గం ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. రేగోడ్ మండలం ఆర్ ఇటిక్యాలకు చెందిన ఉప్పరి బాలరాజు (34), తన సోదరుడు నారాయణతో కలిసి అల్లాదుర్గం ఐబీ చౌరస్తాలో ఇంటి నిర్మాణం చేపట్టారు. శనివారం ఉదయం బాలరాజు భార్య తుల్జమ్మతో కలిసి ఇంటిపైకి సామగ్రి తరలిస్తుండగా, పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. పై నుంచి కింద పడి అపస్మారక స్థితికి వెళ్లగా, హుటాహుటిన 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో బాలరాజు చనిపోయాడు. సోదరుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వామివారికి చక్రస్నానంతో ముగిసిన పుల్లూరుబండ జాతర



స్వామివారిని చక్రస్నానానికి తీసుకెళ్తున్న దృశ్యం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పుల్లూరు బండపై స్వయంభూ శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో 5 రోజుల పాటు ఘనంగా జరిగిన జాతర శనివారం చక్రస్నానం(చక్ర తీర్థం) కార్యక్రమంతో ఘనంగా ముగిసింది. చివరి రోజు సుదర్శన నారసింహహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్య గౌడ్, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, కలకుంట్ల కృష్ణమాచారి, శ్రీనివాసచార్యులు, నచికేతన్‌ల ఆధ్వర్యంలో మధ్యాహ్నం సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. హోమం పూర్ణాహుతి అనంతరం సుదర్శన చక్ర పెరుమాళ్ ఉత్సవమూర్తిని, యాగ జలాన్ని తీసుకు వెళ్లి బండపై ఉన్న పవిత్ర పాలగుండం, లక్ష్మీనరసింహస్వామి గుండాల్లో జలానికి శుద్ధి పూజలు నిర్వహించారు. అనంతరం హోమ జలాన్ని గుండం జలాల్లో కలిపిన అనంతరం సుదర్శన చక్ర పెరుమాళ్ ఉత్సవ మూర్తికి గుండంలో స్నానం చేయించారు. చక్ర పెరుమాళ్ ఉత్సవ మూర్తిని తిరిగి ఆలయంలోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి కోవెలలో ఉంచారు.

వర్గల్‌లో ముస్తాబైన విద్యాధరి క్షేత్రం

- రేపు వసంత పంచమి పర్వదినం
- వేడుకలకు పీఠాధిపతులు, మంత్రుల రాక
- అమ్మవారి దర్శనాలు, అక్షరాభ్యాసాలకు ప్రత్యేక క్యూలైన్లు
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు





వసంత పంచమి వేడుకలకు ముస్తాబైన విద్యాధరి క్షేత్రం, ఆలయంలో కొలువైన సరస్వతీ అమ్మవారు

వర్గల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలంలోని విద్యాధరి క్షేత్రం సోమవారం జరిగే వసంత పంచమి(శ్రీపంచమి) మహోత్సవానికి ముస్తాబైంది. వేడుకల సందర్భంగా విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాలైన లక్ష్మీగణపతి, శనైశ్వర, స్వయంభు శంభులింగేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలను సర్వాంగ సుంద రంగా అలంకరింప జేశారు.

ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఇలా..

వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం 4గంటలకు గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం విద్యా సరస్వతీ అమ్మవారికి పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకరభారతి స్వామిచే విశేషపంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం విద్యా సరస్వతీ అమ్మవారికి 56 రకాల మధుర పదార్థాలతో (చప్పన్‌భోగ్) మహానివేదన, విద్యా సరస్వతీ అమ్మవారి విద్యాజ్యోతి దర్శనం ఉంటుంది. సాయంత్రం ఆలయం ఆవరణలో వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రదోషకాల శ్రీ చక్రపూజ, రాజోపచార పూజ కార్యక్రమాలుంటాయి.

ప్రముఖుల రాక

వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రానికి శ్రీ పుష్పగిరి పీఠాధిపతి జగద్గురువు శ్రీ విద్యా శంకర భారతీ స్వామి, రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానందసరస్వతీస్వామి, వారితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, సిద్దిపేట, దుబ్బాక ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, పలువురు రాష్ట్ర అధికారులు హాజరు కానున్నారు.

నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు



విద్యాధరి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలను ఏర్పాటు చేశాం. అమ్మవారి దర్శనం కోసం, అక్షరాభ్యాసాలకు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశాం. భక్తులకు భోజన వసతిని కల్పిస్తున్నాం. వేడుకలకు సుమారు 50 వేల మంది భక్తులు రానున్నట్లు భావిస్తున్నాం. పోలీస్ శాఖ సహకారంతో విద్యాధరి క్షేత్రం పటిష్టవంతమైన బందోబస్తు ఏర్పాటు చేశాం.

- సిద్ధాంతి చంద్రశేఖరశర్మ, ఆలయ వ్యవస్థాపకుడు

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి



సత్యనారాయణ (ఫైల్)

నంగునూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన మండలంలోని పాలమాకుల పెద్దమ్మ ఆలయం సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పాలమాకుల గ్రామానికి చెందిన పిట్ల సత్యనారాయణ(35) రాంపూర్ క్రాసింగ్ నుంచి బైక్‌పై పాలమాకులకు బయలుదేరాడు. అదే సమయంలో జేపీతండా చెందిన లావుడియా విజయ్ తన బైక్‌పై పాలమాకుల నుంచి తన ఇంటికి బయలుదేరాడు. పెద్దమ్మ గుడి సమీపంలోకి చేరుకోగానే ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రగాయాలకు గురైన సత్యనారాయణను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు, విజయ్‌కి స్వల్ప గాయాలు కావడంతో ఆసుపత్రి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు రాజగోపాల్‌పేట పోలీసులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



కొత్తపల్లి నరేష్(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో శనివారం చోటు చేసుకున్నది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేష్ (39)కు భార్య స్వప్న, తల్లిదండ్రులు ఉన్నారు. గత నెల జనవరి 14న దాతర్‌పల్లి నుంచి గజ్వేల్‌కు వస్తున్న క్రమంలో ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన నరేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం నరేష్ మృతి చెందాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాల నిరోధంపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీ టీమ్ బృందం శ్రీరాములు, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ లావణ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



సిద్దన్నపేట స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

నంగునూరు,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రంగనాయకసాగర్ కుడి కాలువ నుంచి నంగునూరు మండలం సిద్దన్నపేట పిల్ల కాలువ తవ్వకాల పనులు మధ్యలోనే వదిలేయడంతో తమ గ్రామానికి సాగునీరు రావడం లేదని మండలంలోని సిద్దన్నపేట స్టేజీ వద్ద శనివారం రైతులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కాల్వ పనులు పూర్తిచేసి సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందక వేసిన వరి పంటలు చేతికందే దశలో ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రంగనాయక సాగర్ కుడి కాలువ ద్వారా సిద్దన్నపేట గ్రామానికి వచ్చే ఆగిపోయిన పిల్ల కాలువ పనులు వెంటనే పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు కొలుపుల ఆంజనేయులు, బంక మహిపాల్, బొల్లు తిరుపతి, గౌరబోయిన సిద్దయ్య, వస్తాదుల బాబురావు, బెదురు కైలాష్, బండి ప్రశాంత్, బేదురు మల్లేశం, దేవులపల్లి రమేష్, మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సిద్దన్నపేటలోని ఇప్పల్ల చెరువులోకి రంగనాయక సాగర్ ద్వారా సాగు నీరు అందించేందుకు కాలువ తవ్వకం చేపట్టారని, పనులు పూర్తి కాకపోవడంతో గ్రామానికి సాగు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రితం ఎండాకాలం ప్రారంభంలోనే తామంతా ధర్నా చేశామని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు కాలువ తవ్వకం పూర్తి చేస్తామని చెబుతున్నారే తప్ప పనులు చేపట్టడం లేదని తెలిపారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న రాజగోపాలపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి రైతులతో మాట్లాడించారు. కాలువలో బండరాయి ఉందని, పది రోజుల్లో పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని డీఈఈ హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



పెద్దరాజుపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం మండలంలోని పెద్దరాజుపేట, వీరన్నపేట గ్రామాల్లో పర్యటించి, పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వీరన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచు అరిగె భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే గ్రామంలో జరుగుతున్న రిటైర్డ్ టీచర్ మొగుళ్ల రాంచంద్రారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన పెద్దరాజుపేట గ్రామానికి చెందిన అంకని ప్రణయ్‌ను పరామర్శించి, అందుతున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దరాజుపేటలో పర్యటిస్తుండగా ఓ ఇంటి ఆవరణలో సేదతీరుతున్న వృద్ధురాలిని ఎమ్మెల్యే పల్లా ఆప్యాయంగా పలకరించి బాగోగులు అడిగితెలుసుకున్నారు. పెన్షన్ వచ్చిందా... ఎంత వస్తుందని ఆరా తీశారు. వీరన్నపేట, చుంచనకోట గ్రామాలకు తపాస్‌పల్లి జీఎల్‌బీఆర్ ద్వారా మిషన్‌భగీరథ నీటిసరఫరా సక్రమంగా కొనసాగక ఇబ్బందులు పడుతున్నామని, వీరన్నపేట గ్రామస్థులు ఎమ్మెల్యే పల్లాకు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ముస్త్యాల ఓహెచ్‌బీఆర్‌కు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా మార్కండేయ జయంతి

సిద్దిపేట, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీలోని 18వ వార్డులో మార్కండేయ స్వామి ఆలయంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తొగుట రాంపూర్ పీఠాధిపతి శ్రీమాధవానందసరస్వతి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

ఆవాలతో మార్కండేయ స్వామి చిత్రం



గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మార్కండేయ స్వామి జయంతి నేపథ్యంలో ఆవాలతో వినూత్నంగా చిత్రాన్ని ఆవిష్కరించారు. శనివారం గజ్వేల్ రామకోటి కార్యాలయంలో వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు కేవలం ఆవాలను ఉపయోగించి మార్కండేయ స్వామి చిత్రాన్ని రూపొందించారు. అనంతరం భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు.

'నిరుద్యోగులకు అండగా ఉంటా'

గజ్వేల్ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు అండగా ఉంటానని కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో భాగంగా గజ్వేల్‌లోని పలు స్కూళ్లను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంటెస్ట్ అభ్యర్థి బరిలో ఉంటున్నానని, ఎమ్మెల్సీగా గెలిపించాలని గ్రాడ్యుయేట్లను అభ్యర్థించారు.

పాలన చేతకాక కేసీఆర్‌పై విమర్శలా?



క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శనివారం గజ్వేల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.11,66,500 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రం అప్పుల్లో మునిగిపోతుందని, గతంలో కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటే ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారన్నారు. ఎస్సీ వర్గీకరణను మొదట అమలు చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి మాటలు ఏమయ్యాయని, బీసీ కులగణన ఏమైందని ప్రశ్నించారు. ఆయన వెంట నాయకులు నవాజ్‌మీరా, బెండే మధు, ఊడెం కృష్ణారెడ్డి, గంగిశెట్టి రవిందర్, శివకుమార్, ఉమర్, రమేశ్, అహ్మద్, ప్రతాప్, భిక్షపతి తదితరులున్నారు.


ఉనికి కోసమే బీఆర్ఎస్ పాట్లు

నంగునూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో ప్రజా సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేయడంతో ప్రజలు బుద్ధి చెప్పారని, ప్రస్తుతం ఆ పార్టీ ఉనికి కోసం పాకులాడుతుందని మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్ పేర్కొన్నారు. ఆదివారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలంగా ఉద్యమం పేరుతో బీఆర్ఎస్ నాయకులు మాత్రమే అభివృద్ధి చెందారు తప్ప ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదని ఆరోపించారు.హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజల మన్ననలు పొందుతుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో నాయకులు రాములు, సదానందం, బడే అశోక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందూరు ప్రీమియం లీగ్ (ఐపీఎల్) ఇంటర్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడలలో గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. విన్నర్ జట్టుకు రూ.5వేలు, రన్నర్‌కు 2,500, మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌కు రూ.1000 చొప్పున రివార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఈజీఎస్ పనులపై విచారణ చేపట్టాలి



మిరుదొడ్డి ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భూంపల్లి రైతులు

సిద్దిపేట, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామంలో జరిగిన వ్యవసాయ కల్లాలపై జరిగిన ఉపాధిహామీ పనుల అవకతవకలపై విచారణ చేపట్టాలని యాదవసంఘం సభ్యులు శనివారం మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గొర్రెల షెడ్‌లో సీసి నిర్మాణం చేస్తామని చెప్పి తమ జాబ్‌కార్డులను తీసుకున్నారని, తర్వాత సీసీ రాలేదని చెప్పారని తెలిపారు. అనంతరం తమ పేరుతో గ్రామంలోని మరోచోట సీసీని వేశారని వివరించారు.

విద్యార్థులు మానసికంగా బలపడాలి

చేర్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డా. ఇంద్రజీత్ సుష్మిత్ సూచించారు. సిద్దిపేటకు చెందిన రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కడవేరుగు జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్‌కు జిల్లా విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):దుబాయ్‌లోని షార్జాలో జరుగుతున్న ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ కు సిద్దిపేటకు చెందిన విరాట్ ఆనంద్ క్రికెట్ అకాడమీ స్టూడెంట్లు పవన సుత హనుమాన్, లక్ష్మిమణికాంత్ ఎంపికైనట్టు క్రికెట్ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. శనివారం సిద్దిపేటలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్రికెట్ అకాడమీ కోచ్ ముత్యాల ఆనంద్‌తోపాటు, టోర్నమెంట్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

'వేయి గొంతులు- లక్ష డప్పులు' పోస్టర్ ఆవిష్కరణ

గజ్వేల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న కదం తొక్కుదామనివెయి గొంతుకలు... లక్ష డప్పుల కార్యక్రమం రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ అందే భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులతో కలసి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

● రాయపోల్: మండలంలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కమిటీని శనివారం జిల్లా అధ్యక్షులు ముంద్రాతి కృష తదితరుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ రాయపోల్ మండల అధ్యక్షుడి వడ్డెపల్లి గ్రామానికి చెందిన అయ్యగల్ల రవి, ప్రధాన కార్యదర్శిగా టెంకంపేట నర్సింలు, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం 'వేయి గొంతులు.. లక్ష డప్పులు' పోస్టర్ ఆవిష్కరించారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల చేయూత

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన బాధితుల కుటుంబానికి శనివారం మిట్టపల్లి బీఆర్ఎస్ నాయకులు చింతలకుమార్‌యాదవ్ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధితులను ఓదార్చి పార్టీ తరపున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పవన్‌కుమార్

నంగునూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివను సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను అమలులో చూపిస్తున్న చర్యలపై చర్చించినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



చిన్నకోడూరు జడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవంలో జిల్లా జడ్జి సాయిరమాదేవి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు/నంగునూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా జడ్జి సాయిరమాదేవి సూచించారు. చిన్నకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల పై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా జడ్జితో పాటు డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు. నంగునూరు మండలం కొనాయిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.తొలుత అర్చకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతర తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

రాష్ట్రపతిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



అక్కన్నపేటలో సోనియాగాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పై కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సోనియా గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ దళిత ఆదివాసి బిడ్డ అయిన రాష్ట్రపతి ముర్ముపై పార్లమెంట్ సాక్షిగా ఎంపీ రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం దళిత, గిరిజన కుటుంబాలను కించపరచడమేనని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, గిరిజన మోర్చా నాయకులు మోహన్ నాయక్, సురేష్ రైనా తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ అనుకూలమే

(7వ పేజీ తరువాయి)

తెచ్చారన్నారు. 30సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి దీనిపై ఏం సమధానం చెబుతారని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌పై ప్రజలకు విసుగొచ్చింది..

ప్రజలు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలకు విసుగొచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల పెద్దమ్మ తల్లి, పుల్లూరు బండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పుల్లూరులో రంగనాయక సాగర్ ఎడమ కాలువలో పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను పరిశీలించిన అనంతరం బండచెర్లపల్లి గ్రామం వద్ద రైతులతో ముచ్చటించారు. రైతుబంధు రాలేదు, రుణమాఫీ ఆచరణలో లేదు. ఎన్నో ఆశలు పెట్టుకుని బ్యాంకుల్లో డబ్బులు కట్టాం, కానీ మోసపోయాం' అని రైతులు తమ గోడును ఆయనతో వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క ఆలయానికి కూడా నిధులు మంజూరు చేసిందిలేదన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 15 దేవాలయాలకు నిధులు మంజూరు చేసుకుని ప్రొసీడింగ్స్ ఇచ్చామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని, మంజూరైనా వాటి పనులనూ ప్రారంభించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్య గౌడ్, వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగచారి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, మాజీ సర్పంచ్‌లు నరేష్ గౌడ్, కిషన్‌రెడ్డి, నాయకులు వెంకట్, యాదగిరి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట కల్చరల్/నంగునూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని రంగధాంపల్లిలో సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా అంబేడ్కర్‌లాంటి మహనీయుల ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శ్రీరామరాజు రావిచెట్టు హనుమాన్ ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాన కార్యక్రమాన్ని హరీశ్‌రావు సందర్శించి అభినందించారు. సిద్దిపేటలోని ముర్షిద్‌గడ్డ దర్గా ఉర్సును మాజీమంత్రి హరీశ్‌రావు దర్శించుకుని, పీఠాధిపతి ఖాజా మహమ్మద్ హకీమ్ షరీఫ్ చిష్తితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నంగునూరు మండలంలోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయానికి మాజీమంత్రి రూ.లక్ష విరాళం అందించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. నంగునూర్ మండలం కొనాయిపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 10 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను కమిటీ సభ్యులు హరీశ్‌రావుకు అందజేశారు. సిద్దిపేటకు చెందిన వార్డు మాజీ సభ్యుడు, పార్టీ నాయకులు కనకయ్య తారా దంపతులు ఇటీవల పెద్దపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీమంత్రి పరామర్శించారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన బిస్మాట్ సంఘం సభ్యులు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కలిశారు. నూతన సంఘానికి ఏకగ్రీవంగా రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికైన జగ్గు మల్లారెడ్డిని హరీశ్ రావు అభినందించారు.



కోనాయిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఉత్సవ నిర్వాహకులు